ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 31 జనవరి 2026 www.prajaswaramdailly.com 4 PM

# కేతపల్లిలో మహిళ దారుణ హత్య

**ఐదు నెలల చిన్నారికి తీవ్ర గాయాలు**

**కేతపల్లి, ప్రజాస్వరం**

నల్గొండ జిల్లాలో ఘోరం జరిగింది. మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన నాంపల్లి మండలం కేతపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కుందేళ్ల నగేశ్ భార్య మమత (25)తో.. అదే గ్రామానికి చెందిన వంపు సుజాత గొడవపడింది. వాగ్వాదం పెరిగి మమతపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఆ సమయంలో బాధితురాలు తన ఐదు నెలల కుమారుడిని ఎత్తుకొని ఉంది. ఈ ఘటనలో మమత అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే బాబును నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సగం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చిన్నారి చికిత్స పొందుతున్నాడు. మమత భర్తతో సుజాతకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. నగేశ్‌ను అదుపులోకి తీసుకున్నామని.. నిందితురాలు సుజాత పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మంత్రుల సమన్వయం అవసరం

**ప్రతి డివిజన్ , ప్రతి వార్డూ గెలుపు మనకు ముఖ్యమే: సీఎం రేవంత్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

''ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. బీజేపీ, బీఆర్ ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్ , ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్ ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి'' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు.

తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్ లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

# డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం: గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్ పూర్, జనవరి 31(ప్రజా స్వరం)

అమీన్ పూర్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పడిన అమీన్ పూర్, బీరంగూడ డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణా నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించిన శనివారం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు కాలనీ ముఖద్వారం నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందించిన దాసు యాదవ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ పై దుర్మార్గపు వైఖరేంటి?

**కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చారు**

**నందినగర్ నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

''తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు.కేసీఆర్ స్వయంగా తానుంటున్న ఎర్రవల్లి ఫాంహౌస్ నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి!. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారు'' అని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు.

# కోఠి కాల్పుల ఘటనలో ఆటోలో సికింద్రాబాద్ వైపు దుండగులు

**పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

కోఠి కాల్పుల ఘటన.. పోలీసులను దృష్టి మరల్చిన దుండగుల యత్నం చేశారు. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలోకి వెళ్లినట్లు నమ్మించి, తిరిగి బయటకు వచ్చి ఆటో ఎక్కారు. ఆటోలో సికింద్రాబాద్ వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆటో డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నాడు. సికింద్రాబాద్ నుంచి దుండగులు ఎటు వైపు వెళ్లారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



కోఠి కాల్పుల ఘటన నిందితులు.. కాచిగూడ రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లినట్లు పోలీసులు నమ్మాలని అక్కడే స్కూటీ వదిలేశారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ డీమార్ట్ దగ్గర ఇద్దరు నిందితులు డ్రెస్ చేంజ్ చేసుకున్నారు. బట్టలు మార్చుకుని క్యాప్స్ పెట్టుకుని కొత్త వేషధారణలో పారిపోయారు. సీసీ కెమెరాల ద్వారా ఏ రూట్ లో ఎక్కడికి వెళ్లారు? అనేదానిపై ఐదు పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. వందలాది సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# చర్లపల్లిలో విషాదం

**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

**హైదరాబాద్ లోని చర్లపల్లిలో విషాదం చోటుచేసుకుంది. రైలు కింద పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులు బోడుప్పల్ కి చెందిన సురేందర్ రెడ్డి, విజయ, చైతన్య రెడ్డిగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.**

# ఆర్ ఆర్ ఆర్, మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

**ఆ దిశగా బీజేపీ ఎంపీలు కృషి చేయాలి**

**తెలంగాణపై ప్రధానికి చిన్నచూపు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

ఆర్ ఆర్ ఆర్ , మెట్రోకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం అన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్ర బీజేపీ ఎంపీలు కృషి చేయాలని అన్నారు. గాంధీభవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ లో తెలంగాణకు న్యాయం జరగాలన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు ఏం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణపై ప్రధాని మోదీ చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పుట్టుకనే ప్రధాని మోదీ అవమానించారని విమర్శించారు. ఆర్ ఆర్ ఆర్ , మెట్రోకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరారు.

''కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం అహంకారంగా మాట్లాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రంతో సయోధ్య కోరుకుంటోంది. బడ్జెట్ లో మా ప్రతిపాదనలను కేంద్రం అంగీకరించాల్సిందే. తెలంగాణ ఎంపీలు రాష్ట్రం కోసం పోరాడాలి. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలి. రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలి'' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

## నందినగర్‌లోని నివాసంలోనే కేసీఆర్ విచారణ

**హైదరాబాద్,ప్రజాస్వరం**

**నందినగర్ లోని తన నివాసంలో సిట్ విచారణకు కేసీఆర్ అంగీకరించారు. సిట్ నోటీసులపై నేతలతో సుదీర్ఘంగా బీఆర్ఎస్ అధినేత చర్చించారు.**